


పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా

కమీషన్ల కింద ఏటా.. రూ.2 కోట్లు హాంఫట్

ప్రధాన పంటలు ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిని నష్టాలు చూపినా కనీస పెట్టుబడులను దక్కించే టమోటా సాగునే పశ్చిమప్రాంత రైతులు ఎక్కువగా నమ్ముకుంటారు. ఆదుకుంటుందనుకున్న టమోటా మంచి దిగుబడులొచ్చినా అమ్మేందుకు వెళ్లి మార్కెట్లో వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. కూరగాయలు, టమోటా పంటల కొనుగోలుపై సుంకం వసూలును ప్రభుత్వం ఎత్తివేసినా పంట కొనుగోలుపై 10శాతం కమీషన్ రైతుల నుంచి వసూలు చేస్తూ వ్యాపారులు అన్నదాత కష్టాన్ని అడ్డంగా దోచేస్తున్నారు. పంట కొనుగోలులో నిబంధనలు పాటించని వ్యాపారులు మార్కెట్‌యార్డ్‌కు చెల్లించాల్సిన ఒక్క శాతం సెస్ కూడా కట్టకుండా ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. మాఫియాను తలపిస్తూ ఏటా రైతుల కష్టాన్ని కోట్లలో కమీషన్ పేరిట దోచుకుతింటున్న పత్తికొండ మార్కెట్‌యార్డ్ టమోటా వ్యాపారుల వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- దోపిడీకి గురవుతున్న టమోటా రైతులు
- నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు
- 10శాతం సుంకం వసూలు చేస్తున్న వ్యాపారులు
- ఏటా రూ.15 నుంచి రూ.20 కోట్ల మేర లావాదేవీలు
- మార్కెట్‌యార్డ్‌లో మాఫియాను తలపిస్తున్న వ్యాపారుల ఆగడాలు

పత్తికొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ కింద రైతులు 83 హెక్టార్లలో పంటలు సాగుచేస్తారు. ప్రధాన వాణిజ్య పంటలుగా వేరుశనగ, పత్తి, ఆముదం పంటలతో పాటు ఉల్లి, కంది పంటలు అధికంగా సాగుచేస్తారు. దీనితో పాటు ప్రత్యామ్నాయ పంటగా ప్రతిరైతు టమోటాను సాగుచేస్తారు. సుమారు రెండు వేల హెక్టార్లలో ఇక్కడి రైతులు టమోటాను సాగుచేస్తుంటారు. పండిన టమోటాను పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. వ్యాపారులు రైతుల నుంచి అనధికారికంగా 10శాతం సుంకం వసూలు చేస్తున్నారు. దీంతో రూ.1.5కోట్ల నుంచి రూ.2కోట్లు మాయం చేస్తున్నారు. మార్కెట్‌యార్డులో వ్యాపారుల కమీషన్ దోపిడీకి అడ్డుకట్టవేసి వారి ఆగడాల నుంచి రైతులను కాపాడాల్సిన అవసరం ఉంది.

ఎకరాకు 4క్వింటాళ్ల దిగుబడి..

ఎకరా టమోటా సాగుకు నారు, ఎరువులు, పిచికారి మందులు అన్ని కలుపుకుని రూ.30వేల దాకా వస్తుంది. మంచి దిగుబడులు వస్తే కోతకు నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సకాలంలో పంటకు నీరు అందితే 30కోతల వరకు రైతులకు పంట కాలం వస్తుంది. కోత కోసిన పంటను మార్కెట్‌కు తరలించేందుకు 10కిలోల గంపకు రూ10, 25కిలోల గంపకు రూ.20 చొప్పున చెల్లించాలి. పంట పెట్టుబడులు, కోతకూలీలు, ఆటోబాడుగలు కలుపుకుంటే కిలో కనీసం రూ.8కు పంట అమ్ముడుపోతే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. పత్తికొండ మార్కెట్‌యార్డ్‌లో వ్యాపారులు తమకు నచ్చిన ధరతో పంటను కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తుంటారు.

ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం..

ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కూరగాయలు, టమోటా వంటి పచ్చిసరుకుపై సుంకం పూర్తిస్థాయిలో ఎత్తివేసి ఆపంట కొనుగోలుపై సుంకం వసూలు చేయరాదని జీవోలు జారీచేసింది. పత్తికొండ మార్కెట్ యార్డులో జీరో సుంకం విధించిన ఈ ఐదేళ్ల కాలంలో 10శాతం సుంకాన్ని పంట కొనుగోలులో రైతుల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్నారు. వ్యాపారులందరూ సిండికేట్‌గా ఈమార్కెట్లో కొనుగోళ్లు, కమీషన్ వసూళ్లు చేస్తుండడంతో మార్కెట్‌శాఖ అధికారులు ఆంక్షలు విధిస్తే కొనుగోళ్లకు దూరంగా ఉంటామని బెదిరింపులకు దిగుతుంటారు.



పత్తికొండ మార్కెట్‌యార్డు కార్యాలయం

వేరే వ్యాపారులు వస్తే బెదిరింపులే..

పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటుకు పూర్వం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో టమోటా విక్రయాలు జరిగేవి. పత్తికొండ వ్యాపారులతో పాటు హైదరాబాద్, వరంగల్, చెన్నై, తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోళ్లలో పాల్గొనేవారు. మార్కెట్ యార్డు ఏర్పాడ్డాక కూడా వేరే ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ పంట కొనుగోలులో పాల్గొనేవారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేవి. స్థానికంగా ఉన్న వ్యాపారులు సిండికేట్‌గా మారి వేరే ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు రాకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఇక్కడి వ్యాపారులు 10శాతం సుంకం అక్రమంగా వసూలు చేసినా ఏమీచేయలేని పరిస్థితి ఉన్నట్లు మార్కెట్ శాఖలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది నేరుగా తమబాధను చెప్పుకుంటున్నారు.

ఒక్క శాతం సెస్ ఎగవేత

టమోటా కొనుగోళ్లకు సంబంధించి జరిగిన వ్యాపారంపై ఒక్క శాతం మార్కెట్‌యార్డుకు సెస్ చెల్లించాలి. మార్కెట్‌యార్డులో వ్యాపార లావాదేవీలు జరుపుకునేందుకు ఈసెస్‌ను వ్యాపారులు మార్కెట్‌కు చెల్లించాల్సి ఉంటుంది.

మిగతా 6వ పేజీలో



తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ రంజిత్ బాషా
- కాల్వ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓవర్‌హెడ్ స్టోరేజీ ట్యాంకుల పనులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి కలెక్టర్ భూమి పూజచేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో జడ్పీ, మండల పరిషత్, పంచాయతీ నిధులను వినియోగించి తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ నిధుల కింద రూ.1.12కోట్లతో 90వేల లీటర్ల సామర్థ్యం గల మరో 40లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజల సంక్షేమానికి, జిల్లాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు గ్రామంలో ఉన్న కోనేటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన కోనేరులో నీటిని నింపి అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కోనేరును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్ పెద్ద వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల, ఏఈ శ్రీనివాసులు, ఎస్‌ఐ సునీల్ కుమార్, టీడీపీ నాయకులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, గోవిందరెడ్డి, మోహన్‌రెడ్డి, మహబూబ్‌బాషా, చంద్రపెద్దస్వామి, కేవీ మధు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను తెలుసుకోవాలి

- కమిషన్ చైర్మన్ కె.కిషోర్ కుమార్



విద్యార్థులతో కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్

కర్నూలు లీగల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్ తెలిపారు. ఎమ్మిగనూరు డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం తమ పాఠ్యాంశంలో భాగంగా కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో పలు వ్యాపార సంస్థలు, సేవా సంస్థలు వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయన్నారు. వాటిలో సేవాలోపం ఉంటే బాధిత వినియోగదారుడు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి తగిన పరిహారాన్ని పొందవచ్చని తెలిపారు. అందుకోసం వినియోగదారుల హక్కులను తెలుసుకుని విద్యార్థులు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు నారాయణరెడ్డి, న్యాయవాది అనుదీప్‌రెడ్డి, శ్యాంసన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాన్ లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి



మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో నాన్ లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సునయన ఆడిటోరియంలో కర్నూలు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ లేఅవుట్ ప్లాట్ల యజమానులతో పంచాయతీ కార్యదర్శులు ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకున్నట్లయితే స్థలం యజమానులకు బ్యాంకు లోన్లు, కరెంటు, నీటి సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం ఏర్పాటుకు చర్యలు



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో, తహసీల్దార్లు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిష్టాత్మక స్వామి నారాయణ గురుకులం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో స్వామి నారాయణ గురుకులం ట్రస్టు ప్రతినిధులు సుఖ్ వల్లభ్ స్వామి, సద్గుణ్ ప్రియ్ స్వామి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దిన్నెదేవరపాడు పరిధిలోని ట్రిపుల్ ఐటీ డీఎం దగ్గర, కల్లూరు మండలం లక్ష్మీపురం దగ్గర, ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి దగ్గర స్వామి నారాయణ గురుకులం ఏర్పాటు చేసేందుకు భూమిని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, సంస్థ ప్రతినిధులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు.

పీ-4 అమలుపై సీఎం చంద్రబాబు సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమంపై మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ సమీక్షలో కలెక్టర్ రంజిత్ బాషాతో పాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగానే పీ-4 కార్యక్రమాన్ని చేపట్టామని, సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అందుతుందన్నారు. ఈ నెల 19 నుంచి పీ-4 అమలు చేయాలన్నారు. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలను కలిసి వారిలో ఆలోచనను రేకెత్తించాలని పిలుపునిచ్చారు.

పోలవరం-బనకచర్ల సాగునీటి ప్రాజెక్టు మరో కాళేశ్వరం

రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు




మల్యాల ఎత్తిపోతల పథకం కాలువను పరిశీలించి విలేకరులతో మాట్లాడుతున్న ఆలోచనా పరుల వేదిక నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను కృష్ణాజలాలతో అనుసంధానం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హుటాహుటిన తలకెత్తుకున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు మరో కాళేశ్వరం అవుతుందని రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ పోలవరం బనకచర్ల ప్రాజెక్టు వివరాలను పరిశీలించాక అది ఒక పనికి మాలిన ప్రాజెక్టు అని నిర్ధారణకు వచ్చామన్నారు. మంగళవారం నంద్యాల జిల్లాలో 'సీమ సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన చేసిన ఆలోచనాపరుల వేదిక' కమిటీ సభ్యులు పర్యటించారు. పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, నందికొట్కూరు మండలంలోని మల్యాల ఎత్తిపోతల పథకం, జూపాడుబంగ్లాలోని పోతులపాడు ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, అక్కినేని భవానీప్రసాద్, జొన్నలగడ్డ రామారావు, నల్లబోతు చక్రవర్తి, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, రైతు సంఘం నాయకుడు బొజ్జా దశరథ రామిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం విషం చిమ్ముతోందని ఆరోపించారు. మల్యాల ఎత్తిపోతల ద్వారా జలచౌర్యానికి పాల్పడుతున్న దొంగలు అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తే ఏపీ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. అక్కినేని భవాని ప్రసాద్ మాట్లాడుతూ 30 ఏళ్లకాలంలో గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులపై కోట్ల రూపాయలను ఖర్చు చేసినా కూడా అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. రాయలసీమ సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ బచావత్ ట్రిబునల్, రాష్ట్ర విభజన చట్టం ద్వారా రాయలసీమకు సాగునీటి కోసం హక్కుగా ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఆ మేరకు సీమకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు మాట్లాడుతూ 'సీమ'కు కృష్ణాజలాలను తరలించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ
- సీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ



కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మతో వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని కేఎంసీ (కర్నూలు మెడికల్ కాలేజీ) ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ అన్నారు. మంగళవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో అసంక్రమిత వ్యాధుల ఎన్‌సీడీ 40 క్యాన్సర్ వ్యాధిపై సీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ కార్యక్రమాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, తగిన శారీరక శ్రమ లేకపోవడంతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ కృష్ణ ప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్ వచ్చేది ఒక వ్యక్తికే అయినా కుటుంబాన్ని అంతా బాధిస్తుందన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మానవ శరీరంలో గోళ్లకు వెంట్రుకలు తప్ప మిగిలిన అన్ని భాగాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.మహేశ్వర్ ప్రసాద్, వైద్యులు వెంకట సుబ్బ నాగరాజు, సాయిమాధురి, బిందుమాధవి, వంశీకృష్ణ, డా.శివప్రసాద్, డా.సందీప్ రెడ్డి, డా.మంజూషా, డా.శైలేష్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రాలకే ప్రాధాన్యం
- సినీ చరిత్రలో 50 ఏళ్లు పూర్తి
- విలక్షణ నటుడు సాయికుమార్ 6

మాట ఇచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం
- 'సూపర్ సిక్స్' అమలు చేస్తున్నాం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ 7

నటన, నాట్యం, సంగీతం, సాహిత్యం వంటి అంశాలను నలుదిక్కులా చాటిచెబుతూ కందనవోలు కళామతల్లికి మణిహారంగా విరాజిల్లుతోంది కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రం. ఒకటి కాదు, 55 ఏళ్ల ప్రస్థానంలో రెండు కాదు, ఏకంగా 38 రాష్ట్ర నంది అవార్డులు సాధించి, రాష్ట్రంలోనే ఏకైక కళాసంస్థగా విరాజిల్లుతోంది. కళలకు, సాహిత్యానికి కొలమానం డబ్బు, భాష, ప్రాంతాభిమానాలు ఏమీ లేవనే రీతిలో ఉచితంగా కళాకారులకు, సాహిత్యాభిలాషులకు అవకాశం కల్పిస్తోంది. పేద కళాకారులకు, దూరప్రాంతాల నుంచీ వచ్చే కళాకారులకు తగురీతిలో ఆర్థిక సహకారాలు కూడా అందిస్తూ కళలను ప్రోత్సహిస్తూ కళల కాణాచిగా నిలుస్తోంది. వేలాది మంది ఔత్సాహిక కళాకారులకు నిలయంగా నిలుస్తోన్న టీజీవీ కళాక్షేత్రం 55 ఏళ్లుగా తన ఉనికిని చాటుకుంటోంది. నాడు ఆరుబయలు కళాక్షేత్రంగా ఉన్న లలిత కళాసమితి తన రూపురేఖలను మార్చుకొని అత్యంత ఆధునిక హంగులతో ఏసీ థియేటర్లను మరపిస్తోంది.

- కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



కళానిలయం

టీజీ వెంకటేశ్ సహకారంతో...



కర్నూలులో 1970లో అప్పటి ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కేవీ చలపతిరావు, డిప్యూటీ కలెక్టర్ కె. వెంకటరెడ్డి, ఉపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ 'లలిత కళాసమితి' పేరుతో సంస్థను నెలకొల్పారు. సి.క్యాంపులోని 24 సెంట్ల స్థలాన్ని సేకరించారు. వీరి కృషి ఫలితంగా 1998లో మొట్టమొదట జరిగిన నంది నాటక పోటీల్లో ఐదు నందులతో పాటూ జ్యూరీ అవార్డును 'నరనారాయణ' అనే నాటకం అందుకుంది. దీనికి సింహం లక్ష్మీనారాయణ దర్శకుడు. వ్యవస్థాపకుల్లో ఒకరైన సయ్యద్ అహ్మద్ సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహిస్తూ ఎన్నో బహుమతులు సాధించారు. ఆరోజుల్లో జంపాల శివయ్య అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక సమితి రూపురేఖలు మార్చేశారు. తర్వాత ఈ పరంపరను అధ్యక్షులుగా థామస్‌రెడ్డి, పి.దస్తగిరి కొనసాగించారు. వారి తర్వాత అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన పత్తి ఓబులయ్య కళాక్షేత్రం అభివృద్ధిలో తనదైన ముద్రను వేసుకున్నారు. ఇదే క్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సహకారంతో 2006నుంచి సమితి రూపురేఖలు మారిపోయాయి. 2009లో ఆడిటోరియం లాంఛనంగా ప్రారంభమైంది. తర్వాత ఏసీ ఏర్పాటుతోపాటు ప్రేక్షకులు హాయిగా కూర్చొని తిలకించే కుషన్ సీట్లు, లిఫ్ట్ ఏర్పాటు, అగ్నిమాపక సౌకర్యం కల్పించారు. టీజీవీ కళాక్షేత్రం ప్రాంగణంలో రెండంతస్తుల భవన నిర్మాణానికి టీజీ వెంకటేశ్ తిరిగి రూ.3 కోట్ల విరాళం అందజేశారు. ఫలితంగా నవ్యాంధ్ర రాష్ట్రంలోనే అన్ని హంగులు ఉన్న కళామందిరంగా రూపొందింది. 38 నందులతో పాటు తిరుపతి, ఒంగోలులో జరిగే జాతీయ నాటక పోటీల్లోనూ ఎన్నో అవార్డులను కళా క్షేత్రం కైవసం చేసుకుంది.


టీజీవీ కళాక్షేత్రానికి లభించిన అవార్డులు

నెలరోజులూ సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు

టీజీవీ కళాక్షేత్రంలో నెలపొడవునా సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి 'ఆదివారం సాంస్కృతిక కార్యక్రమం', ప్రతి నెలా చివరి ఆదివారం 'నాటకం', అలాగే సాంఘిక నాటిక, కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అలాగే బాలల కోసం ప్రత్యేకంగా 'టీజీవీ అకాడమీ' పేరుతో చిన్నారులకు నృత్య శిక్షణలు వారంలో రెండు రోజులు ఏర్పాటు చేశారు. అలాగే వేసవిలో బాలల కోసం ప్రత్యేకంగా నృత్య, నటన, చిత్రలేఖన, వక్తృత్వ శిక్షణలు ఇస్తూ వారిని కళారంగం పట్ల ప్రోత్సాహం కల్పిస్తున్నారు.

- కళలకు నిలయం.. సాహిత్యానికి నీరాజనం..!
- 38 నంది పురస్కారాలు సొంతం
- కళామతల్లి మణిహారంగా టీజీవీ కళాక్షేత్రం


ఆడిటోరియంలో ప్రేక్షకులు

నంది అవార్డులు సాధించిన నాటకాలు ఇవే

199	నరనారాయణకు	5
1999	పులిస్వారీ	2
1999	మబ్బుల్లో బొమ్మ	1
2000	కృష్ణాభిమన్యు	1
2004	భక్తమాధవదాసు	1
2007	శ్రీకృష్ణాభిమన్యు	2
2009	మహారథి కర్ణ	1
2011	ఓ మనిషీ నీకు జోహార్లు	2
2012	బభ్రువాహన విజయం	1
2012	బభ్రువాహన విజయం (వెండి నందులు)	3
2014	శ్రీకృష్ణాభిమన్యు	3
2015	కర్ణార్జునీయం	4
2016	ప్రమీలార్జున పరిణయం	7
2017	సైసై నరసింహారెడ్డి	3
2023	శ్రీకృష్ణకమలపాలిక	2

కళలు, సాహిత్యాలకు నిత్యం ప్రోత్సాహకాలు



కళలు, సాహిత్యానికి పెద్దపీట వేస్తూ నిత్యం ప్రోత్సాహకాలు అందిస్తూ టీజీవీ కళాక్షేత్రం ముందుకు పోతోంది. గత 55 ఏళ్లుగా నిర్విరామంగా సేవలు అందిస్తోంది. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ల సహకారం ఎన్నటికీ మరువలేనిది. టీజీ వెంకటేశ్ ఆర్థికంగానే కాకుండా, హార్థికంగా ఇచ్చిన చేయూత నేడు నగరంలో టీజీవీ కళాక్షేత్రం ఒక స్థానం సంపాదించుకుంది. కళామతల్లికి సేవ చేయాలనే ఆయన ప్రోత్సాహమే మమ్మల్ని నడిపిస్తోంది. టీజీవీ కళాక్షేత్రం ప్రదర్శించే పద్య నాటకాలకు నేను దర్శకత్వం వహిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇస్తున్నాం. అలాగే అనేక పురస్కారాలు సాధిస్తున్నాం. మేమే కాకుండా ఎవరు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించినా, కళాక్షేత్రం అన్ని సౌకర్యాలతో పాటూ ఉచిత విద్యుత్తును కూడా కల్పిస్తూ వారికి అవకాశం ఇస్తోంది. స్థానిక కళాకారులకు ప్రోత్సాహంతో పాటూ, ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులకు కూడా చేయూత ఇచ్చే విధంగా కార్యక్రమాలు నెలపొడవునా నిర్వహిస్తున్నాం.

- కళారత్న పత్తి ఓబులయ్య, అధ్యక్షుడు, టీజీవీ కళాక్షేత్రం

కమీషన్ల కింద ఏటా.. రూ.2కోట్లు హాంఫట్



5వ పేజీ తరువాయి

బయటి వ్యాపారులు రాకుండా తాము మాత్రమే టమోటా కొనుగోలు చేస్తున్న స్థానిక వ్యాపారులు అక్రమంగా వసూలుచేసే 10శాతం సుంకం ఆపకపోగా మార్కెట్‌యార్డుకు చెల్లించాల్సిన 1శాతం సెస్‌ను కట్టకుండా ఎగవేస్తున్నట్లు తెలిసింది. అధికారులను సైతం వారు బెదిరిస్తూ మాఫియాను తలపిస్తున్నట్లు సమాచారం.

ప్రతి ఏటా రూ.15 నుంచి రూ.20 కోట్ల..


మార్కెట్‌యార్డులో ఏటా రూ.15 నుంచి రూ.20కోట్ల మేర టమోటా వ్యాపారం జరుగుతున్నట్లు అధికారిక నివేదికల ద్వారా తెలుస్తుంది. అనధికారికంగా ఈమొత్తం ఇంకా ఎక్కువ ఉండవచ్చని సమాచారం. గత ఏడాది ఆగస్టు నెల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఏడు నెలల పాటు ఈమార్కెట్‌లో టమోటా విక్రయాలు జరగగా 72,642 టన్నుల టమోటాను వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేశారు. 6నుంచి 8టన్నుల వరకు లారీల ద్వారా వ్యాపారులు కొన్నపంటను తరలిస్తుంటారు. గత ఏడాది 10 నుంచి 12వేల లారీల సరుకును వ్యాపారులు ఇక్కడి నుంచి ఎగుమతులు చేశారు. ఏడునెలల పాటు జరిగిన 72,642 టన్నులకు గాను రూ.15 నుంచి 20కోట్ల వరకు వ్యాపారులు లావాదేవీలు జరిపారు.

పేరుకే పెద్దమార్కెట్

పత్తికొండ టమోటా మార్కెట్ పేరుకే పెద్ద మార్కెట్. టమోటా మార్కెట్ ద్వారా మార్కెట్‌యార్డుకు అందుతున్న ఆదాయం మాత్రం నామమాత్రమే. గత ఏడాది రూ.8లక్షలు మాత్రమే వ్యాపారుల నుంచి సెస్ డబ్బులు అందాయి. వారం సంతద్వారా వారానికి రూ.60 నుంచి రూ.70వేల ఆదాయం ఉండటంతో సిబ్బంది జీతభత్యాలు ఇవ్వగలుగుతున్నాం.

● కార్నలీస్, కార్యదర్శి, పత్తికొండ మార్కెట్‌యార్డు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తికొండ మార్కెట్‌యార్డులో టమోటా కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టాలి. గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్న రైతులపై 10శాతం కమీషన్ దోచుకోవడం దారుణం. టమోటా కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేసి వ్యాపారులపై చర్యలుచేపట్టాలి.

● డి .రాజాసాహెబ్, ఏపీ రైతుసంఘం జిల్లాకార్యవర్గ సభ్యుడు


చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మఠం అధికారులు

ఉత్సవాలకు ఆహ్వానం

మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మఠం అధికారులు మంగళవారం ఆహ్వానం పలికారు. వారితో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోంమంత్రి అనిత, మాజీమంత్రి, ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, సజ్జల రామకృష్ణారెడ్డిలకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ ఆహ్వాన పత్రికలను అందజేశారు.


లోకేశ్‌కు ఆహ్వానం


జగన్‌కు ఆహ్వానం

వాన కోసం..

● తుంగా జలంతో గ్రామ దేవతలకు అభిషేకాలు ● రచ్చుమర్రిలో అనాదిగా వస్తున్న ఆచారం

మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరుణదేవుడు కరుణించకపోవడంతో పంటలు ఎండిపోవడం చూస్తున్న రైతన్నలు అనాదిగా వస్తున్న సంప్రదాయ, ఆచారాలను కొనసాగిస్తున్నారు. మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వెయ్యి మంది రైతులు పాదయాత్రగా మాధవరం గ్రామానికి వెళ్లారు. అక్కడ తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి తమ వెంట తుంగా జలాలను తీసుకొచ్చారు. బిందెలు, చెంబులు, పాత్రల ద్వారా తుంగా జలాలను స్వగ్రామానికి తీసుకొచ్చారు. భజనమండలి, తప్పెట్లు, బీరప్పడోల్లుతో పాదయాత్రతో గ్రామానికి చేరుకుని తెచ్చిన తుంగభద్ర జలాలతో గ్రామంలో కొలువైన బంగారమ్మ దేవతకు, ఆంజనేయస్వామి, రామలింగేశ్వరస్వామి, మారెమ్మ, దేవమ్మ దేవతలకు అభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు.


తుంగా జలాలతో ఊరేగింపుగా వెళ్తున్న రచ్చుమర్రి గ్రామ ప్రజలు

సందేశాత్మక చిత్రాలకే ప్రాధాన్యం

- సినీ చరిత్రలో 50 ఏళ్లు పూర్తి
- 500 సినిమాల్లో నటించా..
- విలక్షణ నటుడు సాయికుమార్



మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల సినీ చిత్ర పరిశ్రమలో సందేశాత్మక చిత్రాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చానని ప్రముఖ తెలుగు, తమిళం, కన్నడ సినీ నటుడు సాయి కుమార్ అన్నారు. మంగళవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 1975 జనవరి 11న తన 14 ఏళ్ల వయస్సులో బాలనటుడిగా 'దేవుడు చేసిన సినిమా' లో తెరంగేట్రం చేశానని అన్నారు. తెలుగులో 500 చిత్రాలు, కన్నడ, తమిళంతో కలిపి వందకు పైగా చిత్రాల్లో తాను నటించినట్లు తెలిపారు. వెయ్యికి పైగా డబ్బింగ్ చెప్పానన్నారు. 20కి పైగా నంది, ఫిల్మ్‌ఫెయిర్ పాటు పలు అవార్డులు అందుకున్నానని తెలిపారు. తన కొడుకు ఆది సాయికుమార్ ప్రస్తుతం మూడు చిత్రాల్లో హీరోగా చేశాడనీ, త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. తన తండ్రి పీజే శర్మ వారసత్వాన్ని అందిపుచ్చుకుని తమ్ముళ్లు రవిశంకర్, అయ్యప్ప నటులుగా, కళాకారులుగా కొనసాగుతున్నారన్నారు. పోలీస్ స్టోరీ చిత్రంతో తన జీవితం ఒక మలుపు తిరిగిందని, పోలీస్ స్టోరీతో పోలీసులకు ఒక ఆదర్శమైన చిత్రాన్ని రూపొందించామన్నారు. తాను ఎక్కడకు వెళ్లినా పోలీసులు కనిపిస్తే.. తన పాత్రనే ఆదర్శంగా తీసుకుంటామని పోలీసులు చెబుతున్నప్పుడు తనకు ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. సాయిదుర్గతేజ హీరోగా సంబరాల ఏటిగట్టు, 12ఏ రైల్వే కాలనీ, ర్యాంప్, బ్యాడ్ బాయ్ కార్తిక్, సత్య సన్నాఫ్ హరిశ్చంద్ర, రాజా ది రాజా, డేగల్ వంటి చిత్రాల్లో నటించడం జరిగిందన్నారు. మొదటి చిత్రం 100 రోజులు రికార్డు కొడితే.. 50 ఏళ్ల తర్వాత సంక్రాంతికి వస్తా.. అనే చిత్రం విజయవంతం గా సంతృప్తినిచ్చిందని అన్నారు. కన్నడ, తమిళ్‌లో రెండేసి చిత్రాల్లో నటిస్తున్నానని చెప్పారు. తన కుమార్తె డాక్టర్ జ్యోతిర్మయి డాక్టరుగా పని చేస్తూ భరతనాట్యంలో రాణిస్తోందన్నారు. తన చెల్లెలు సైతం చెన్నై, హైదరాబాదులో ఈ సంప్రదాయ నృత్య కళాకారిణి అకాడమీలు నిర్వహిస్తున్నారన్నారు. చిన్నతనంలో మంత్రాలయం వచ్చానని, రెండోసారి మంత్రాలయం రావడం జరిగిందన్నారు. రాఘవేంద్రస్వామి, పీఠాధిపతి ఆశీస్సులతో కుటుంబంతో మళ్లీ మంత్రాలయానికి వస్తానని తెలిపారు.

అప్పులు తెచ్చి భోజనం వడ్డిస్తున్నారు



- భారంగా మారిన మధ్యాహ్న భోజనం నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న వంట నిర్వాహకులు
- జిల్లాలో 23 ప్రభుత్వ కళాశాలల్లో పథకం అమలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం బిల్లులు అందక వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల నుంచి బిల్లులు అందక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనాలు పెట్టలేక చుక్కలు చూస్తున్నారు. వంట కార్మికుల వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికిచ్చేది అరకొరే.. అదికూడా సకాలంలో రాక వర్కర్లు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 4వ తేదీ నుంచి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ఇంటి నుంచి లంచ్ బాక్సులు తెచ్చుకునే వెసలుబాటు లేక కడుపులు మాడ్చుకుని సాయంత్రం వరకు ఉండి వెళ్లేవారు. అయితే ఈ ఏడాది నుంచి విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. మెనూలో సమూల మార్పులు చేసి రుచి, శుచికరమైన ఆహారం అందిస్తుండటంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య ఘననీయంగా పెరిగింది. హాజరు శాతం కూడా పెరిగింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 9,772 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,522 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,250 మంది ఉన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట ఏజెన్సీలకు ప్రభుత్వం సివిల్ సప్లయిస్ ద్వారా బియ్యం, గుడ్లను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రోజుకు ఒక విద్యార్థికి నూనె, దినుసులు, కూరగాయల ఖర్చులకు గానూ ఒక్కో విద్యార్థికి రూ.8.57 చొప్పున వంట ఏజెన్సీల నిర్వాహకులకు చెల్లిస్తారు. రోజుకు 90 శాతం మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు. వంట కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు రూ.3వేలు గౌరవ వేతనం చెల్లిస్తారు. మెస్ బిల్లులతో పాటు వర్కర్స్‌కు వేతనాలు కూడా మంజూరు చేస్తారు. ఒక కళాశాలలో నెలకు రూ.8 లక్షల వరకు బిల్లులు అవుతున్నాయి. ఈ లెక్క ప్రకారం ఆరు నెలలకు గానూ రూ.50 నుంచి రూ.60 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అధిక రేట్లకు వడ్డీలతో అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నారు. అసలు, వడ్డీ కలిపి తడిసి మోపెడవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భోజనాలు పెట్టలేమని వంట ఏజెన్సీల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి గత ఆరు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలి. బిల్లులు ఇవ్వకపోతే భోజనాలు ఎలా పెట్టాలి? తెచ్చిన అప్పులకు వడ్డీలు, అసలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం.

- రమాదేవి, వంట కార్మికురాలు, కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కర్నూలు

కుకింగ్ కాస్ట్ పెంచాలి



మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మొత్తాన్ని పెంచి ఇవ్వాలి. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతుండటం వల్ల తినే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సకాలంలో బిల్లులు మంజూరు చేయడం లేదు. గ్యాస్ ధరలతో పాటు కూరగాయలు, నూనెలు, వంట దినుసుల రేట్లు కూడా పెరిగాయి. పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు కూడా చెల్లించాలి.

- పర్వీన్, వంట కార్మికురాలు, కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కర్నూలు

బిల్లుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని మధ్యాహ్న భోజనం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లించేందుకు ఆయా కళాశాలల నుంచి వివరాలు సేకరించి ఇంటర్మీడియట్ బోర్డుకు పాఠశాల ఎడ్యుకేషన్ శాఖకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. త్వరలోనే వంట ఏజెన్సీల నిర్వాహకుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతాయి. కంగారు పడవద్దు. వంట నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందించాలి. పరిశుభ్రత పాటించాలి.

- సురేష్‌బాబు, డీఐఈవో



జల హొయలు



కర్నూలు నగర శివారులోని గార్గేయపురం చెరువు జలకళను సంతరించుకుంది. చెరువుకు అనుబంధంగా ఉన్న చెక్ డ్యాంల నుంచి వరద పొంగి ప్రవహిస్తోంది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గార్గేయపురం చెరువు నిండు కుండలా దర్శనమిస్తోంది. మరో వైపు హంద్రీనీవా కాలువ తూము ద్వారా జలాలు విడుదల కావడంతో చెరువుకు జలకళ సంతరించుకుంది. నందికొట్కూరు రోడ్ నగరవనం సమీపంలోని గార్గేయపురం చెరువు వద్ద చెక్‌డ్యాంలపై వస్తున్న జల హొయలను చూసేందుకు నగర ప్రజలు భారీగా తరలివస్తున్నారు.

- కర్నూలు రూరల్(ఆంధ్రజ్యోతి)
ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఎంపీఈవోలకు గుర్తింపు ఏదీ?

- సచివాలయాల సిబ్బందితో సమానంగా విధులు
- జీతాలు మాత్రం అంతంతే
- ఉద్యోగ భద్రత కరువాయె
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- సమ్మె వైపు అడుగులు?

వ్యవసాయ శాఖలోని పథకాలు రైతులకు చేరవేయడంలో కీలక పాత్ర వహిస్తున్న బహుళ ప్రయోజన విస్తరణాధికారులు(ఎంపీఈవో). 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వీరిని నియమించింది. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ శాఖలో పని చేస్తున్న వీరికి గుర్తింపు ఇవ్వకుండా సచివాలయాల వ్యవస్థ తీసుకువచ్చి వీరిని నిర్లక్ష్యం చేసింది. సచివాలయాల సిబ్బందితో అర్హత గల ఎంపీఈవోలు సచివాలయాల సిబ్బందితో పాటు సమానంగా విద్యార్హతలు ఉండి, సమానంగా పని చేస్తున్నా వేతనంలో మాత్రం చాలా తేడా ఉంది. ఎలాగో అలా అరకొర వేతనాలతో బతుకుబండి సాగిస్తుండగా ఐదు నెలలుగా వేతనాలు కూడా అందడం లేదు. దీంతో ఏమిచేయాలో తోచక సమ్మెబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.



పాణ్యం వ్యవసాయశాఖ కార్యాలయం

పాణ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎంపీఈవోలు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నా వారికి గుర్తింపు మాత్రం అంతంత మాత్రమే ఉంది. వ్యవసాయ శాఖను మరింత అభివృద్ధి బాట పట్టించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 2014 డిసెంబరు 18న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖలో 306 ఎంపీఈవో పోస్టులను నిర్ణీత గౌరవ వేతనం నెలకు రూ.8వేల చొప్పున నియమించింది. కాంట్రాక్టు పద్ధతిపై రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన జీవోఆర్‌టీ నెంబరు 693 ఎఅండ్‌సీ (వ్యవసాయ శాఖ2)అనుసరించి మొదటి విడత నియామకాలు జరిపింది. వీరిలో 109 మంది మహిళలున్నారు. ఎంపికలో స్థానికు లకు 80 శాతం, 20 శాతం స్థానికేతరులకు 80శాతం మార్కులతో మౌఖికపరీక్ష ఆధారంగా 20 శాతం మార్కులు పరిగణలోకి తీసుకొని ఎంపిక చేశారు.

సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి..

గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ శాఖలో పని చేస్తున్న వీరికి ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదు. సచివాలయాల వ్యవస్థ తీసుకువచ్చి నిర్లక్ష్యం చేసిందని ఎంపీఈవోలు ఆరోపిస్తున్నారు. సచివాలయాల సిబ్బందితో అర్హత గల ఎంపీఈవోలు సచివాలయాల సిబ్బందితో పాటు సమానంగా విద్యార్హతలు ఉండి, సమానంగా పనిచేస్తున్నా వేతనంలో మాత్రం సమాన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా కలెక్టర్ ఆధ్వర్యంలో అభ్యర్థులను ఎంపిక చేశారు. 2014 నుంచి రూ. 8వేల వేతనంతో వీరు పనిచేస్తుండగా 2019లో టీడీపీ ప్రభుత్వం వేతనాన్ని రూ.12 వేలకు పెంచింది. అప్పటి నుంచి వీరి వేతనాలు గానీ, ఎలాంటి ఇతర సౌకర్యాలు పెంచలేదు. వీరికి ఏలాంటి గుర్తింపు దక్కలేదని ఆరోపిస్తున్నారు. పనికి సమానమైన వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. ఉద్యోగ భద్రత కరువై తక్కువ వేతనంతో బతుకీడుస్తున్నామని పేర్కొంటున్నారు. ప్రస్తుత ఖర్చులకు ఈవేతనం ఏమాత్రం సరిపోదని పనిభారం పెరిగిందని సరైన న్యాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చాలీచాలని వేతనాలతో.. మార్చి నెల నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు ఎంపీఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న వీరి జీవనంపై వేతనాలు అందకపోవడం సమస్య మరింత భారంగా మారినట్లు పేర్కొంటున్నారు. ఐదు నెలలుగా వేతనాలు అందకుండా ఎలా పని చేయాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయక పోవడంతో ఎంపీఈవోలు సమ్మె బాట పట్టనున్నట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీఈవోల సంఘాలు పెన్‌డౌన్ సమ్మెపై చర్చలు కొనసాగిస్తున్నట్లు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు రైతులకు చేరువయ్యేలా కృషి చేస్తున్న ఎంపీఈవోల వ్యవస్థ నీరుగారే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి..



ఎంపీఈవోలను ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలి. పనితనాన్ని గుర్తించి సరైన న్యాయం చేయాలి. మార్చినుంచి అందాల్సిన వేతనాలు వెంటనే మంజూరు చేయాలి. పని భారం పెరిగింది ఆమేరకు వేతన సవరణ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం చేపట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా 1,394 మంది, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 346 మంది ఎంపీఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. ● **జింకల ప్రసాద్, ఏపీఎంపీఈవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల**

వేతన బకాయిలు మంజూరు చేయాలి



ఎంపీఈవోలకు ప్రభుత్వం వేతన బకాయిలు వెంటనే మంజూరు చేయాలి. రైతులకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే ఎంపీఈవోలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు. ఎంపీఈవోల వ్యవస్థను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి. పనికి తగ్గ వేతనాన్ని అందించి న్యాయం చేయాలి. ప్రభుత్వం ఎంపీఈవోల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు చేపడుతాం. ● **రామచంద్రుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, నంద్యాల**

ఆరుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపెండేకల్లుకు చెందిన ఉప్పరి ప్రసాద్, తిమ్మప్ప, మల్లికార్జున, నాగరాజు, ఈరన్న, వీరేష్‌పై తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డిని వీరు మద్యం మత్తులో దాడి చేశారని, అంతేకాకుండా మధుసూదన్‌రెడ్డి కుటుంబానికి చెందిన ఓ మహిళను ఉప్పరి ప్రసాద్ కొన్నిరోజులుగా వేధిస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

- అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా
- డీఆర్వోకు వినతిపత్రం



కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రంలో మరో ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వం అక్రిడిటేషన్ మంజూరులో అసంబద్ధమైన నిర్ణయాలు, నిబంధనలు విధించడంతో 23వేల నుంచి 9 వేలకు అక్రిడిటేషన్లు కుదించారన్నారు. తాము అధికారంలోకి వస్తే అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్లు ఇస్తామని కూటమి పార్టీల నేతలు చెప్పారని, ఏడాదిన్నర దాటినా ఇంతవరకు కొత్త అక్రిడిటేషన్ల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల హామీలో భాగంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి, గృహ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, బీహార్ రాష్ట్రాల తరహాలో సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో జర్నలిస్టుల పిల్లలకు వందశాతం ఫీజు రాయితీ ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.వి. సుబ్బయ్య, గౌరవ సలహాదారు వై.వి.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈ.ఎన్.రాజు, కె. శ్రీనివాస గౌడ్, కోశాధికారి అంజి, నాయకులు దస్తగిరి, శివరాజ్‌కుమార్, అవినాష్, రామయ్య పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

ఆదోని రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద తుంబళం గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు దబ్బు నరసయ్యను అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్ కుమార్ తెలిపారు. వివరాల మేరకు.. నిందితుడు మంగళవారం కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తుండగా, గ్రామ శివార్లలో అదుపులో తీసుకుని, 100 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యాన్ని విక్రయించేవాడు. ఇప్పటికే పదుల సంఖ్యలో కర్ణాటక మద్యం కేసులు నమోదైనట్లు సమాచారం. పోలీసులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా సాధికారతపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జనస్వామ్య సహకారం, మహిళల నాయకత్వం వంటి అంశాలపై మంగళవారం ఢిల్లీలో విస్తృత స్థాయి సమీక్షా జరిగినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. బ్రిటీష్ హై కమిషనర్ క్రిస్టినా స్కాట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి యూకే హౌస్ ఆఫ్ కామన్స్ డిప్యూటీ స్పీకర్ నుస్రత్ ఘానీనీ ఆహ్వానించామన్నారు. జనస్వామ్య సహకారం, మహిళల నాయకత్వ అంశాలపై చర్చించుకున్నట్లు ఆమె తెలిపారు.

భర్త కనిపించడంలేదని ఫిర్యాదు



పెద్దన్న (ఫైల్)

బండిఆత్మకూరు ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవ ళాపురం గ్రామ సర్పంచ్ పెద్దన్న కనిపించడం లేదని అతని భార్య పార్వతి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ మంగళవారం రాత్రి తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, ఇప్పటి వరకు తిరిగి రాలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వామ్మో చిరుత!

- బెల్లందొడ్డి గ్రామంలో కలకలం

దేవనకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్లందొడ్డి గ్రామ సమీప పొలాల్లో చిరుత కనిపించడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిళ్లు పొలాల్లో సంచరిస్తుండటంతో కొందరు వీడియో తీశారు. అటవీ, పోలీసు అధికారులు చిరుత పాద ముద్రలను సేకరించారు. చిరుతని గుర్తించడం కోసం ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాత్రిళ్లు పొలాలకు నీళ్లు కట్టేందుకు రైతులు వెళ్లవద్దని అటవీ అధికారులు సూచించారు.



బెల్లందొడ్డి పొలంలో కనిపించిన చిరుత

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురైన యువకుడు మంగళవారం మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంతోష్‌కుమార్(22) ఆరు నెలల క్రితం శ్రీనివాస క్రషర్ మిషన్‌లో పనిలోకి చేరాడు. వెల్డింగ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎమ్మిగనూరు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు

మాట ఇచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం

- 'సూపర్ సిక్స్' అమలు చేస్తున్నాం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారాలోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం గూడెంకొట్టాల వాసులకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం అశోక్‌నగర్ పంప్‌హౌస్ ప్రాంతంలో గూడెం కొట్టాలలో అత్యంత ఖరీదైన ఒక ఎకరం స్థలంలో 150 మందికి జీవో.నెం.30 ప్రకారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రిజిస్టర్ పట్టాలను వారిపేరు మీద అందజేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఈ జీవో.నెం.30ని జనవరి 2025లో ఇచ్చిన ప్రకారం మొదటి సారి మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం మంగళగిరిలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, రెండో సారి కర్నూలులో ఇళ్ల పట్టాలు ఇచ్చి రికార్డ్ సృష్టించామన్నారు. దీనిని ఇంత త్వరగా కార్యరూపంలో పెట్టడం వెనుక జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, తహసీల్దార్ల కృషి ఉందని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఆగస్టు 15న మహిళలందరికీ రాష్ట్రమంతటా తిరిగే వెసులుబాటుతో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ జీవో.నెం.30 వచ్చినప్పటి నుంచి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ 40 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న గూడెం కొట్టాల వాసులకు పట్టాలు ఇచ్చేలా కృషి చేశారన్నారు. రేపటి నుంచి ఆ స్థలాలు మీ సొంతమని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో జేసీ బి.నవ్య, ఆర్డీవో సందీప్ కుమార్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు గూడెం రాజశేఖర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి

● 21, 25 వార్డులకు యథావిధిగా తాగునీరు సరఫరా
● నగర పాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దేవనగర్ సమీపంలో అదనపు రైల్వే లైన్ పనుల కారణంగా దెబ్బతిన్న 400 ఎంఎం పైపులైన్ మరమ్మతు పనులు పూర్తయ్యాయని, 21, 25 వార్డులకు యథావిధిగా తాగునీరు సరఫరా అవుతుందని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన సంఘటన స్థలానికి వెళ్లి మరమ్మతు పనులను పరిశీలించారు. అంతకుముందు 2వ వార్డులో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు రుసుముల వసూళ్లు చేస్తున్న నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో పురోగతిపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈ మనోహ ర్‌రెడ్డి, ఆర్‌ఓ జునైద్, డీఈఈలు గిరిరాజు, నరేష్ ఉన్నారు.

బీజేపీ నూతన కమిటీ సభ్యులకు సత్కారం


బీజేపీ నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ తదితరులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా నూతన కమిటీ సభ్యులను మంగళవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సత్కరించారు. మంగళవారం నగరంలోని మౌర్య ఇన్‌లో టీజీ వెంకటేశ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీజీ వెంకటేశ్‌తోపాటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామస్వామి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పార్టీని బలోపేతానికికి కృషి చేస్తామన్నారు.

బిడ్డలకు తల్లి పాలే శ్రేయస్కరం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డలకు తల్లిపాలే శ్రేయస్కరమని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి అన్నారు. నగరంలోని వడ్డెగేరి అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశా సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా మాస్ మీడియా అధికారి శ్రీనివా సులు హాజరై మాట్లాడారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్-ఏ ద్రావణ పంపిణీ, నవజాత శిశు సేవల వివరాలను అప్‌లోడు చేయాలన్నారు. బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.వెంకటరమణ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిం చాలని ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ అధ్యక్షుడు గుడిసె ఉరుకుంద కోరారు. మంగళవారం గూడూరులో జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రారెడ్డికి ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ వినతి పత్రం సమర్పించింది. కార్యక్రమంలో జర్నలిస్టులు వి.శ్రీనివాసులు, కేజీ శ్రీనివాస నాయుడు, ప్రభా కర్ నాయుడు, కిరణ్, లక్ష్మన్న, అబ్దుల్లా పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించని కళాశాలల యజమాన్యాలపై చర్యలు తీసుకో వాలని ఆర్ఐవో లాలెప్పకు రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు మంగళ వారం వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలో సైన్స్ ల్యాబ్స్, ఫైర్ సేఫ్టీ పరికరాలతోపాటు అర్హత లేని ఫ్యాకల్టీలో బోధన చేయిస్తున్నారని ఆరోపించారు. ఏపీ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎద్దుపెంట అంజి, కోనేటి వెంకటేశ్వర్లు, బాలకృష్ణ ఉన్నారు.

పుల్లన్న, గిడ్డయ్య సేవలు మరువలేనివి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారుల సంఘం బలోపేతానికి పుల్లన్న, గిడ్డయ్య సేవలు మరువలేనివని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ కొనియాడారు. మంగళవారం వీరనారి ఐలమ్మ కార్యాలయంలో సంఘం న్యూసిటీ కమిటీ కార్యదర్శి సి.శేషాద్రి అధ్యక్షతన పుల్లన్న, గిడ్డయ్యవ 5వ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతబస్తీ కార్యదర్శి సి.జయమ్మ, ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మ, కోశాధికారి శ్రీనివాసులు, సి.రాముడు, పుల్లన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రగ్బీ పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏసియా అంతర్జాతీయ స్థాయి రగ్బీ అండర్-20 చాంపియన్‌షిప్స్‌కు రగ్బీ ఇండియా ఫెడరేషన్ నుంచి కర్నూలు చెందిన రామాంజనేయులు ఎంపికయ్యారు. ఈ నెల 9, 10 తేదీల్లో బిహార్ రాష్ట్రంలోని రాజ్‌గిరి అంతర్జాతీయ స్టేడియంలో చాంపియ న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు రామాంజనేయులు తెలిపారు. పోటీల్లో 8 దేశాలకు చెందిన పురుషులు, మహిళల జట్లు పోటీ పడనున్నాయని తెలిపారు. తనకు మొదటిసారిగా పోటీలకు అధికారిగా ఆహ్వానించడం పట్ల సంతోషంగా ఉంద న్నారు. ఈయన ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగు తున్న విషయం విదితమే

స్మార్ట్ మీటర్లు పెడితే పగులగొడతాం

ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుల హెచ్చరిక

కల్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు పెడితే పగులగొడతామని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల విధానానికి వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కర్నూలు విద్యుత్‌శాఖ కార్యాలయాల ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. సి.గురుశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకుడు టి.రాముడు, రైతుసంఘం సహాయ కార్యదర్శి శ్రీని వాసరావు, ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి హరీష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగులగొట్టమని పిలుపునిచ్చిన టీడీపీ నేతలు అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను ఎలా బిగిస్తారని విమర్శించారు.

● స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేస్టేషన్ సమీపంలోకి కర్నూలు డివిజన్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

● ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోకి విద్యుత్ ఏఈ కార్యాలయలం ముందు వామపక్ష, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ధర్నా చేశారు. అనంతరం ఏఈ సుజాతకు వినతిపత్రం అందించారు.

● స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం బి.క్యాంపు విద్యుత్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఐఖ్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

● కార్పొరేట్లకు దోచిపెట్టే స్మార్ట్ మీటర్లు వద్దని కార్మిక ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకుడు గౌస్‌దేశాయ్ అన్నారు. మంగళవారం జోహరాపురం కరెంట్ ఆఫీసు ముందు ధర్నా చేశారు.

● ఉలిందకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రైతుసంఘం మండల కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ కార్యదర్శి కె.మధు ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

ఓర్వకల్లు: స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని విరమించుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీధర్, జిల్లా కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఏఈ సునీల్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు షాజహాన్, మధుసూదన్, మల్లేష్, కేశాలు, శ్రీరాములు, మల్లికార్జున పాల్గొన్నారు.

గూడూరు: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం గూడూరులోని విద్యుత్ శాఖ కార్యాలయం దగ్గర కార్మిక ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృప, మద్దిలేటి, రవి, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, నాగరాజు, దానమయ్య పాల్గొన్నారు.


కర్నూలు డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు


ఓర్వకల్లులో..


గూడూరులో..

జగన్‌ది తుగ్లక్ పాలన

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తుగ్లక్ పాలన కొనసాగించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆరోపించారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యువగళం పాదయాత్ర పుస్తకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో దోపిడీ, స్కామ్‌లే చేశారన్నారు. 2023 జనవరి 27న నారా లోకేశ్ కుప్పం నుంచి యువగళం పేరుతో రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర 4,123 కి.మీ నడిచి ప్రజలకు అండగా నిలిచారన్నారు. జిల్లాల వారిగా ప్రతి నియోజ కవర్గంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. అందులో ముఖ్యమైన ఘట్టాలను ఇక పుస్తకం రూపంలో ప్రచురితం చేసి పంపించారన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.హనుమంతరావు చౌదరి, కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, అమర్నా థ్‌రెడ్డి, ఆదాం, పుల్లయ్య పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతాం

ఓర్వకల్లు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతామని తహసీల్దార్ విద్యాసాగర్ హెచ్చరించారు. ఓర్వకల్లులోని కాటసాని నగర్‌లో అక్రమంగా ప్లాట్లు వేసి రాళ్లు వేశారని, వాటిని తొలగించామన్నారు.మూడు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి 20 ట్రిప్పుల రాళ్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ మాట్లా డుతూ ఓర్వకల్లులో అక్రమ లేఅవుట్లు వేసి గృహాలను నిర్మిస్తున్నారని, అలాంటి వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో స్వామన్న, సచివాలయ సర్వేయర్ కీర్తన పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వేదికగా ఇటీవల జరిగిన 19వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారని జిల్లా సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు తెలిపారు. అండర్-14 బాలబాలికల విభాగంలో మూడో స్థానంలో అండర్-10 బాలికల విభాగంలో మూడో స్థానం కైవసం చేసుకున్నారు. మంగళవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు గెలుపొందిన క్రీడాకారులకు అభినందించి ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా బిషప్ ప్రమాణస్వీకారం

● నంద్యాల డయాసిస్ బిషప్‌గా రెవరెండ్ సంతోషి ప్రసన్న రావు


నంద్యాల డయాసిస్ బిషప్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సంతోషి ప్రసన్నరావు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నంద్యాల డయాసిస్ బిషప్‌గా ఎన్నికైన రెవరెండ్ సంతోషి ప్రసన్న రావు ప్రమాణస్వీకార కార్యక్రమం వైభవంగా జరిగింది. నంద్యాల హోలీక్రాస్‌కెథడ్రిల్ చర్చిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం మాడరేటర్ రూబెన్‌మార్క్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 2024 ఏప్రిల్‌లో నంద్యాల డయాసిస్ అధ్యక్ష మండలపు పీఠాధిపతి ఎంపికకు జరిగిన ఎన్నికల్లో అర్హత సాధించిన రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావును చెన్నైలోని సినాడ్ అధికారులు ఎంపిక చేశారని జనరల్ సెక్రటరీ పెర్నాండెజ్ అన్నారు. ఈకార్యక్రమానికి నంద్యాల డయాసిస్ పరిధిలోని నంద్యాల, కర్నూలు, అనంతపురం, కడప, ప్రకాశం, జిల్లాలో పనిచేస్తున్న చర్చిపాదర్‌లు, క్రైస్తవులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాయలసీమ బిషప్ ఐజక్ వరప్రసాద్, కృష్ణ గోదావరి బిషప్ జార్జికొర్నేలియస్, డోర్నకల్ బిషప్ పద్మారావు, కోయంబత్తూర్ బిషప్ తిమోతిరవీందర్, కర్ణాటక సెంట్రల్ బిషప్ హేమచంద్రకుమార్, మదురై బిషప్ జయసింగ్ ప్రిన్స్ ప్రభాకరన్ పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో రైతు సాధికార సంస్థ బయోరీసోర్స్ సెంటర్, అమృత భూ ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల ఉత్పత్తుల విక్రయ కేంద్ర యజమాని పుల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గానికి రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారని.. ఒకటి హుశేనాపురం, మరొకటి కల్లూరులో ఏర్పాటు చేశారని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, ఏవో మధుమతి, నాయకులు మహ బూబ్ బాషా, కాకి దేవేంద్ర, రామగోవిందు, కేవీ మధు, వెంకటేశ్వర్లు, అయ్యస్వామి, ప్రకృతి వ్యవసాయ అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

హామీల అమలుకు చంద్రబాబు కృషి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, గ్రామ నాయకులు కాదర్‌బాషా, రజాక్ బాషా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. మంగళవారం ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పిలుపు మేరకు కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగ ణంలో రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరంత రంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృషి చేస్తుందన్నారు. పీఆర్‌సీ, ఐఆర్, డీఏ సరెండర్ లీవ్స్ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన కార్యదర్శి

కర్నూలు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భానును మంగళవారం ఢిల్లీలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగమధు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాగమధు యాదవ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామన్నారు.

గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలి: ఏవో

కల్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అర్హులై ఉండి అన్నదాత సుఖీభవ పథకానికి నగదు పడని రైతులు సమీప రైతు సేవాకేంద్రంలో గ్రీవెన్స్ లో నమోదు చేసుకోవాలని కల్లూరు మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం 'పొలం పిలుస్తోంది'లో భాగంగా కె.మార్కాపురం గ్రామంలో డీఆర్సీ వ్యవసాయ అధికారి నాగసరోజమ్మతో కలిసి ఆయన రైతులకు వ్యవసాయ మెలుకువలపై అవగాహన కల్పిం చారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బిర్లాగేటు వద్ద ఉన్న బ్రహ్మరెడ్డి కాన్ఫరెన్స్ హాలులో సమావేశం జరిగింది. మహేంద్ర నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు స్పెషల్ ఫీజులు, అక్యుమలేషన్ సొమ్మును దుర్వినియోగం చేశారని, ప్రిన్సిపాల్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి అక్రమంగా వసూళ్లు చేసిన ఫీజులను తిరిగి కళాశాల అకౌంటులో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్‌గౌడు, అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు మధు, క్రిష్ణ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

కర్నూలు క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో చెన్నమ్మ సర్కిల్‌లో టీడీపీ కార్యకర్త రామకృష్ణపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరిచారు. ఆ ముగ్గురు యువకులు ఒకరిపై ఒకరు వాగ్వాదం చేసుకుంటుండగా..రామకృష్ణ వారిని విడిపించే ప్రయత్నం చేశాడు. దీంతో ఆ ముగ్గురు కలిసి రామకృష్ణపై దాడి చేసి సెల్‌ఫోన్, కొంత నగదు లాక్కుని పరారయ్యారు. రామకృష్ణ దగ్గర దోపిడీ చేసేందుకే ఆ ముగ్గురు నాటకం ఆడింటారని పోలీసులు భావిస్తున్నారు. ఆ ముగ్గురు యువకుల కోసం సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన డ్రగ్స్ వద్దు బ్రోపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ఉందన్నారు. ఈగల్ టోల్ ఫ్రీ.నెం.1972ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈగల్ సిబ్బంది వై.ఎలిషా, మాసూంవలి, బి.రమేష్, అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, ఉల్గోజిరావు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి టీమ్

కోడుమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో మహిళల భద్రత కోసం శక్తి టీమ్ పని చేస్తోందని ఏఎస్ఐ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం శక్తి టీమ్‌పై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శంకర్‌నాయక్ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై వేధింపులు, ఇతర నేరాలను అరికట్టడానికి శక్తి టీం రాష్ట్రంలో పని చేస్తుందన్నారు. మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు శ్రీనివా సులు, మద్దిలేటి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

ఓర్వకల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో బంగారు కుటుంబాల దత్తతపై మార్గదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న కుటుంబాలను గుర్తించి ఆర్థికంగా చేయూత ఇవ్వాలని కోరారు. ఆయా గ్రామాల ప్రజలు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

గోరంట్లలో 'పొలం పిలుస్తోంది'

కోడుమూరు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయాధికారి రవిప్రకాష్ గౌడ్ పత్తి రైతులకు పలు సూచనలిచ్చారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ పత్తిలో బెట్ట పరిస్థితులను అధిగమించేందుకు యూరియా ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. అనంతరం గోరంట్ల మజరా కొత్తపల్లిలో ఏవో, సర్పంచ్ బాలక్రిష్ణ రైతులకు యూరియా పంపిణీ చేశారు.

బాటమారెమ్మకు పూజలు

కోడుమూరు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాల కుర్తి గ్రామంలో మంగళవారం బాటమారెమ్మకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం బాటమారెమ్మ విగ్రహానికి టెంకాయలు సమర్పిస్తూ తరలించారు. కొత్తూరు సరిహద్దున అమ్మవారిని ఉంచి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుగు ముఖం పట్టారు.

ఘనంగా టీజీ భరత్ జన్మదిన వేడుకలు

కర్నూలు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● **సేవా కార్యక్రమాలు:** పెద్ద మార్కెట్‌లోని చేపల మార్కెట్ వద్ద టీడీపీ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొని మహిళలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం సి.క్యాంప్‌లో అన్నదాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అంతక ముందు కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు వార్డుల నాయకులు, కార్యకర్తలు వచ్చి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. గజమాల వేసి అనంతరం కేక్ కట్ చేయించారు.

ప్రజల మధ్య వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉంది: మంత్రి


బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్‌కు వేద ఆశీర్వాదం

ప్రజల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని మంత్రి టీజీ భరత్ అన్నారు. టీజీ భరత్ మాట్లాడుతూ అన్నదానం, రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. టీజీ భరత్ నివాసంలో వేద పం డితులు ఆయన్ను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. గోశాల, అమ్మవారిశాలలో టీజీ భరత్ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

టీజీ భరత్‌కు సోమిశెట్టి శుభాకాంక్షలు: మంత్రి టీజీ భరత్‌కు ఆయన నివాసంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన కుమారులు సోమిశెట్టి కిషోర్ కుమార్, సోమిశెట్టి నవీన్ కుమార్‌లు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలి యజేశారు. సోమిశెట్టి వెంక టేశ్వర్లు మాట్లాడుతూ టీజీ భరత్ రానున్న రోజుల్లో మరెన్నో జన్మదిన వేడుకలు సంతోషంగా జరుపుకోవాలన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన గౌరు దంపతులు

కల్లూరు: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడు కలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మంత్రి టీజీ భరత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని దుశ్శాలువాలతో సన్మానించి వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు.

నగర బ్రాహ్మణ సంఘం వేద ఆశీర్వాదం

కర్నూలు కల్చరల్: మంత్రి టీజీ భరత్‌కు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వాదం ఇచ్చి సత్కరించారు. మంగళవారం ఉదయం నగరంలోని సంకల్‌బాగ్‌లోగల మంత్రి టీజీ భరత్ నివాసంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని వేంక టేశ్వర స్వామి అక్షింతలతో వేదాశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఉపాధ్యక్షుడు శ్యామసుందర్‌రావు, కోశాధికారి సీఎస్ ప్రసాదరావు, టీవీ రవిచంద్రశర్మ పాల్గొన్నారు.

గోశాలకు రూ.10 లక్షల ట్రాక్టర్ విరాళం

కర్నూలు అర్బన్: శ్రీగాయత్రి గోసేవా సమితికి రూ.10 లక్షలు విలువ చేసే ట్రాక్టర్‌ను మంత్రి టీజీ భరత్, ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో డీవీఆర్ గ్రూప్స్ సంస్థల అధినేత డి. వెంకటేశ్వరరెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డీవీఆర్ డిజిటల్ జనరల్ మేనేజర్ ఎస్కే మహేష్, గాయత్రి గోసేవా సమితి ప్రతినిధులు డీవీ జగదీష్, ఇల్లూరు లక్ష్మయ్య, టీఎస్ విజయకుమార్, డీవీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కర్నూలు జీజీహెచ్‌లో మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకల సందర్భంగా కిమ్స్ హాస్పిటల్-5, ఓమేగా హాస్పిటల్-5, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ-5, కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం-5 మొత్తం 20 స్ట్రెచర్లను మంత్రి హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లుకు విరాళంగా అందించారు. అనంతరం టీజీ భరత్ మహిళా సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోగులకు దుప్పట్లు, పండ్లను మంత్రి పంపిణీ చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, సీఎస్ఆర్ఎంవో డా.టీసీహెచ్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో పద్మజ పాల్గొన్నారు.


మంత్రి టీజీ భరత్‌కు కేక్ తినిపిస్తున్న అభిమానులు


గోశాలకు ట్రాక్టర్‌ను విరాళంగా అందజేస్తున్న డీవీఆర్ గ్రూప్స్ అధినేత వెంకటేశ్వరరెడ్డి, మహేష్


టీజీ భరత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గౌరు దంపతులు

వర్ష బీభత్సం

మంగళవారం తెల్లవారుజామున ఆదోని, ఆలూరు, హొలగుంద మండలాల్లో వర్షం దంచి కొట్టింది. వర్షపు నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. హొలగుంద మండలం నిట్రవట్టి వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా వర్షం కురవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. -ఆదోని అగ్రికల్చర్, ఆలూరు, హొలగుంద



ఆదోని ఆస్మియా ఉర్దూ ఉన్నత పాఠశాల వద్ద వర్షపు నీరు


ఆదోని ఎస్కేడీ కాలనీలో కూలిన భారీ వృక్షం


ఆలూరులో వర్షపునీరు


హొలగుంద మండలం నిట్రవట్టి వద్ద వాగు ఉధృతి

అంతర పంటలతో అధిక దిగుబడి


సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

తుగ్గలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు అంతర పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి స్తుందని ఏవో సురేష్ యాదవ్ సూచించారు. మంగళవారం తుగ్గలి, గిరిగెట్ల గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. కంది, సజ్జ పంటలను పరిశీలించి తెగుళ్ల, పురుగు నివారణకు రైతులకు సూచనలు ఇచ్చారు. సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. ఏఈవో లక్ష్మీనారాయణ, మల్లేష్, మాజీ సర్పంచ్ పుల్లన్న, రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.

టిడ్కో గృహాలను వెంటనే అప్పగించాలి


టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరకముందే వాటిని లబ్ధిదారులకు అప్పగించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, పార్టీ జిల్లా నాయకుడు దిలీప్ దోక డిమాండ్ చేశారు. మంగళవారం వీరు టిడ్కో గృహాలను పరిశీలించారు. టీడీపీ ప్రభుత్వం నిర్మించిన గృహాలను వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేయలేదన్నారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు మారుతి రావు, దేవిశెట్టి వీరేష్, తాయన్న పాల్గొన్నారు.

ప్లాట్ల రాళ్లను తొలగించడం అన్యాయం


ప్లాట్ల వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే లైన్ అవతల ఉన్న ఇందిరమ్మ కాలనీ సమీపంలో 13 ఏళ్ల క్రితం ప్లాట్లను కొంటే ఇప్పుడు ఓ వ్యక్తి సరిహద్దు రాళ్లను తొలగించి చదును చేశారని బాధితులు ముత్తమ్మ, నాగరాజు, వలి, నాగేష్, సావిత్రమ్మ, మహేష్, అనిత వాపోయారు. మంగళవారం చదును చేసిన ప్లాట్ల వద్ద నిరసన తెలిపారు. సర్వే నెం.221/బి, 222/బి, 223/బి లోని 5.46 ఎకరాల పొలాన్ని హజరత్, షేక్షావలి, ఖైరున్‌బీ ప్లాట్లు వేయడంతో 2011లో మధ్యవర్తి శ్రీనివాసులు ద్వారా తాము కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు. మూడు రోజుల క్రితం గులాం అనే వ్యక్తి వచ్చి ఆ భూమి తనదని ఆధారం చూపకుండానే సరిహద్దు రాళ్లను తొలగించి చదును చేశారన్నారు తాము పోలీసులకు ఆశ్రయించామని, న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు తెలిపారు.

ఆదోని పెద్ద కాలువ పరిశీలన


పెద్దకాలువలో వరద నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

ఆదోని టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి 7.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దాదాపు 80 మి.మీ.ల మేరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమై, ఇళ్లలోకి నేరు చేరింది. ముంపుకు గురైన ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ కృష్ణ, చైర్ పర్సన్ లోకేశ్వరి సందర్శించారు. ప్రధాన రహదారులపై నీటిని పారిశుధ్య సిబ్బందితో తొలగించారు. పట్టణంలోని మట్కావీధి, శ్రీనివాస భవన్ ప్రాంతం, రైల్వే స్టేషన్ ప్రాంతాల స్థానికులతో మాట్లాడారు. కాలువలను మూసివేసిన కారణంగా వర్షపునీరు ముందుకు వెళ్లే వీలులేక ఇలా అయిందని కమిషనర్ తెలిపారు. పెద్ద కాలువలలో పూడిక తొలగింపు చేస్తున్నామని, వరద నీరు రోడ్లపైకి చేరకుండా తీసుకోవాల్సిన చర్యలపై కౌన్సిల్ సభ్యులు, అధికారులతో చర్చిస్తామని చైర్ పర్సన్ లోకేశ్వరి తెలిపారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం


పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. మంగళవారం వైద్యశాలలో మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారికి అల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా మింగించాలన్నారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు మండలంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ అన్ని పాఠశాలల్లో ఈ మాత్రలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం నులిపురుగుల నివారణ పోస్టర్లను విడుదల చేశారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, డిప్యూటీ పారా మిలిటరీ అధికారి ధనలక్ష్మి, మలేరియా యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ఉన్నారు.

అక్టోబరు 5న వాల్మీకి జయంతి

పత్తికొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అక్టోబర్ 5న వాల్మీకి జయంతి వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజి పేర్కొన్నారు. మంగళవారం మాట్లాడుతూ పట్టణంలో 20 వేల మందితో భారీ ఊరేగింపు, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

చెత్త లక్ష్యం


గుడిమిరాళ్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న కేంద్రం

దేవనకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తను సేకరించి, కంపోస్టుగా మార్చి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని ప్రభుత్వ లక్ష్యం. అయితే అధికారుల నిర్లక్ష్యంతో అది నెరవేరడం లేదు. మండలంలోని గుడిమిరాళ్ల గ్రామంలో చెత్త సంపద కేంద్రం నిర్మించిన అధికారులు దాన్ని నిరుపయోగంగా వదిలేశారు. రూ.6.6లక్షలు వెచ్చించి, చెత్త సంపద కేంద్రాన్ని నిర్మించిన అధికారులు ఇలా నిరుపయోగంగా వదిలేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటిని కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువుకు గండి

ఆస్పరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగలాయిదొడ్డి చెరువుకు మంగళవారం తెల్లవారుజామున గండి పడింది. భారీ వర్షం కురవడంతో గండి పడినట్లు సమాచారం. మండలంలో 24.4 మి.మీ. వర్షం కురవగా చెరువుకు పై భాగమైన ఆదోని ప్రాంతంలో 82.4 మి.మీ. వర్షం కురిసింది. వర్షపునీరు వృథాగా పోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండి పూడ్చాలని కోరుతున్నారు.


వృథాగా పోతున్న నీరు

పింఛన్ ఇవ్వండి సారూ..



ఈ ఫోటోలో కనిపిస్తున్న వృద్ధురాలు మండలంలోని ఎడవలి గ్రామానికి చెందిన మాదిగ నాగమ్మ (76). తనకు ఇంతకుముందు పించన్ వచ్చేదని, తొలగించడంతో ఇబ్బంది పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. తన కూతురు మానసికంగా సరిగాలేకపోవడంతో ఆమెకు కూడా పించన్ వస్తుందని తనకు తొలగించారని వాపోయింది. అధికారులు స్పందించి తిరిగి పింఛన్‌ను మంజూరు చేయాలని వేడుకుంది. ఈ విషయంపై ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ విచారించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరణ ఇచ్చారు. - మద్దికెర

డాక్టర్ మేడం బిజీ..

- 104లో ఆశా వర్కర్లు, హెల్త్ అసిసెంట్లచే వైద్యపరీక్షలు
- గర్భిణుల పట్ల వైద్యుల చెలగాటం


గర్భిణులకు మందులు పింపిణీ చేస్తున్న ఆశావర్కర్

హొళగుంద, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 104 ద్వారా సేవలందించాల్సిన వైద్యులు అందుబాటులో ఉండకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీ సిద్దప్ప తాత ఆలయం వద్ద 104 ద్వారాయి గర్భిణులకు ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్ పరీక్షలు చేయడం కినిపంచింఇ. ఇక్కడి వైద్యురాలు బిందు మాధవి ఉండకుండా సిబ్బందితో వైద్యం చేయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రమే ఉంటారని 104 డ్యూటీకి హాజరు వేసి, ఫోటో దిగి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలన్నాయి. ఈ విషయంపై 104 డ్యూటీ డాక్టర్ బిందు మాధవిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురాం రెడ్డిని వివరణ కోరగా 104 డ్యూటీ డాక్టర్ తప్పనిసరిగా హాజరు కావాలని, విచారణ చేస్తామని తెలిపారు.

బాలింతలకు అవగాహన



ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఆదోని టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చిన్న పిల్లల ఆసుపత్రిలో డా మాధవీలత, డా సమీవుల్లా పిల్లలకు తల్లిపాల ఆవశ్యకతను బాలింతలకు వివరించారు. ఆవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పురిటి పిల్లల వార్డులోని బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్త, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతా శ్రీ, శ్రీదేవి, సంతోషి, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

సూర్య ఘర్‌తో మేలు


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఆలూరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సూర్య ఘర్ యోజనతో విద్యుత్ వినియోగదారులకు మేలు కలుగుతుందని తిరుపతి తనిఖీ పర్యవేక్షణ శాఖ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణం లోని విద్యుత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లులు తగ్గుతాయని, గృహ వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈ పురుషోత్తం, ఏఈ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు వద్దని ఇప్పుడు అమర్చుతారా?

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీపీఐ నాయకుల ఆగ్రహం


మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను బిగిస్తామని చెప్పడంపై సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టాలని చెప్పిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. వెంకటేశ్వర్‌రెడ్డి, కిరుమంచి, రాజాసాహెబ్, రామాంజనేయులు, గురుదాస్, వెంకటరామిరెడ్డి, రవిచంద్ర, సిద్ధు, సిద్ధలింగప్ప ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి


ఆదోనిలో తహసీల్దార్‌కు వినతిపత్రం


మద్దికెరలో వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పత్తికొండటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు రంగన్న, సాలు రంగడు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళ వారం నాలుగు స్తంభాల కూడలి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. పాత అక్రిడిటేషన్ కార్డులను పొడిగించకుండా కొత్త కార్డు లను మంజూరు చేయాలన్నారు. హెల్త్ స్కీంను మరింత ప్రయోజనకంగా తీర్చిదిద్దాల న్నారు. ఇళ్ల స్థలాలను ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకో వాలన్నారు. ఓబులేష్, నాగరాజు, లక్ష్మీనారాయణ, హనుమంతు, రాజగుప్తా, రమేష్, పవన్, షేక్షావలి, బద్రినాథ్, రాజశేఖర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపియుడబ్ల్యూజే తాలుక అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా నాయకులు వీరేష్ నాయుడు, గౌస్ కోరారు. ఆదోనిలో జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. మొలగవల్లి రవికుమార్, రామాంజనేయులు, ఈరన్న, పీరా, వెంకటేశులు, నాగరాజు ఉన్నారు.

తుగ్గలి: నాగలింగన్న, మురళీమోహన్ రెడ్డి, నాగేంద్ర ధర్నాచేసి, వినతిపత్రం ఇచ్చారు.

మద్దికెర: జర్నలిస్టులకు నిబంధనలు లేకుండా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నాయకులు రాజేష్ గౌడ్, వీరశేఖర్, వెంకటేశ్వర్లు బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ధర్నా నిర్వహించి, తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు.

హొళగుంద: అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని సీహెచ్ నాగరాజు, బీఎం అమీరసాబ్ డిమాండ్ చేశారు. విరుపాక్షి, నాగప్ప, సంజయ్ క్రిష్ణ మహబూబ్ బాషా, ముద్దార్, ఈడిగ నాగరాజ్ గౌడ్ ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

మద్దికెర, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు గంటలోపు పట్టించే ముర్రుపాలతో నవజాత శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తహసీల్దార్ గుండాల్ నాయక్, ఎంపీపీ అనిత, సర్పంచ్ బండారు సుహాసిని, సీడీపీవో లలిత అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మద్దికెరలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీపీఏపీ కమ్యూనిటీ హాల్‌లో గర్భిణులకు సీమంతం, బాలింతల బిడ్డలకు అన్నప్రాసన నిర్వహించారు. బిడ్డకు ఆరు నెలల వరకు రోజుకు 8 నుంచి 10సార్లు తల్లిపాలు ఇవ్వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ త్రివేణి, తదితరులు ఉన్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు


మంత్రి టీజీ భరత్‌తో నాయకుడు

ఆస్పరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహోతూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొంక మధుసూదన్, సూరి ఆలూరు సమస్యలను మంత్రి టీజీ భరత్ దృష్టికి తసుకెళ్లారు. మంగళవారం మంత్రిని కర్నూలె కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలూరులోలో అధికార పార్టీ గెలవలేదని, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. శ్రీనివాసులు, సురేష్, వినోద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి


మంత్రి భరత్‌తో దేవేంద్రప్ప

ఆదోని, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప మంత్రి టీజీ భరత్‌ను కోరారు. మంగళవారం కర్నూలులో మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయస్సు లోనే తండ్రికి తగ్గ తనయుడిగా మంత్రి భరత్ రాజకీయంగా ఎదిగారని అభినందించారు.

సంక్షేమ హాస్టళ్లలో సన్న బియ్యంతో భోజనం


సన్నబియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-2 చిరంజీవిరెడ్డి

ఆలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సన్నబియ్యంతో భోజనం అందిస్తుందని ఎంఈవో-2 చిరంజీవిరెడ్డి అన్నారు. మంగళవారం మోడల్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేసి, భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు సన్నబియ్యం సరఫరా చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్ రాఘవరావు, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్, వార్డెన్, సుధారాణి పాల్గొన్నారు.

పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలి


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

వెల్దుర్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించాలని సీడీపీవో లూక్ సూచించారు. మంగళవారం సూదేపల్లి అంగన్వాడీ-1, 2 కేంద్రాల్లో సూపర్‌వైజర్ పద్మావతి, నర్సాపురం అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో 'తల్లిపాల వారోత్సవాలు' నిర్వహించారు. తల్లిపాలు శ్రేయస్కరమని, పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు తాపించాలన్నారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడానికి కావాల్సిన అన్నిరకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయన్నారు.

ప్రభుత్వ బడికి దాతలు సహకరించాలి

- విశ్రాంత రాయల సీమ ఐజీ, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్



మాట్లాడుతున్న విశ్రాంత ఐజీ ఇక్బాల్

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు సహకరించాలని విశ్రాంత రాయలసీమ ఐజీ ఇక్బాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మేకల బజారులో తాను దత్తత తీసుకున్న ఆసియా ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ పరికరాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. తాను ఇక్కడ చదువుకున్నానని, పట్టణానికి చేయూతనివ్వాలని సంకల్పించానన్నారు. ఐజీగా ఉన్న సమయంలో నెహ్రూ మెమోరియల్ పాఠశాల వంటశాల నిర్మాణం, మైదానం అభివృద్ధికి కృషి చేశానన్నారు. హెచ్ఎంలు నూర్ బాషా, అలీమ్ సిద్ధికి, గిరిబాబు, ప్రభుత్వ ఖాజీ అల్తాఫ్, ఎంఈవో భూపాల్ రెడి, ఉపాధ్యాయులు జుబేర్ కళ్యాణ్ రావు జగన్నాథ్, ఇలియాస్, యూనిస్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రద్దు చేయాలి


ఎమ్మిగనూరులో ధర్నా చేస్తున్న ప్రజా ఐక్యవేదిక నాయకులు


మంత్రాలయంలో..


కోసిగిలో...

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, తాలుకా నాయకులు సత్యన్న విద్యుత్తు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మంగళవారం స్థానిక విద్యుత్తు కార్యాలయంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలపై తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ 32వేల కోట్ల రూపాయలు ప్రజల నుంచి ఆర్థిక దోపిడి చేశారని, ఎన్నికల ముందు సభలలో ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి లోకేష్ జగనన్న ప్రజలపై విద్యుత్ చార్జీలు బాదుడే బాదుడు అని ప్రచారం చేసి స్మార్ట్ మీటర్లు పెడితే పగల గొట్టమని తెలుగు తమ్ముళ్లకు పిలుపునిచ్చి ఇప్పుడు మాట తప్పారాన్నారు. కార్యక్రమంలో రాజు, రాముడు, గణేష్, రమేష్, కాలప్ప, అనీఫ్, సురేష్, చిన్ని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: స్మార్ట్ మీటర్లపేరుతో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుసుందని వీటిని రద్దు చేసి విద్యుత్ భారాన్ని తగ్గించాలంటూ మంగళవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు జగదీష్, ఈరన్న మల్లయ్య, నాగేంద్రప్ప అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం ఉదయం విద్యుత్ స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లను రద్దు చేసి ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలంటూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్న చేపట్టారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు రామాంజనేయులు, నారాయణప్ప, వెంకటేటష్, సత్యప్ప, చిన్నమారయ్య పాల్గొన్నారు.

మంత్రాలయం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదానితో కుమ్మక్కై ప్రతి ఇంటికీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించాలన్న ఆలోచనను అడ్డుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జయరాజు కోరారు. నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మంత్రాలయం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రాణేష్, లక్ష్మన్న, ఆంద్రయ్య, రైతు సంఘం నాయకులు వీరేష్, కేవీపీఎస్ నాయకులు అంజి, పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్మార్ట్ మీటర్లను పొలాల విద్యుత్ మోటర్లకు, గృహాలకు బిగిస్తే ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ప్రజాసంఘాల ఐక్యవేదిక సీపీఎం, సీపీఐ, కేవీపీఎస్, సీఐటీయూ, ఏపీడీకేఎస్, ఏఐటీయూసీ, నాయకులు మద్దిలేటినాయుడు, కరుణాకర్, నబీరసూల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను బిగించవద్దని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోసిగి: గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించాలని చూస్తే ఉద్యమం తప్పదని, ప్రజాసంఘాల ఐక్యవేధిక ఆధ్వర్యంలో మంగళవారం కోసిగి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, ఏఐటయూసీ మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే విద్యుత్ సర్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపిందన్నారు. అదే విదంగా రాష్ట్రంలో 2 కోట్ల స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదానితో కూటమి ఒప్పందం చేసుకుందని, ఇదే జరిగితే ప్రజలపై వేల కోట్ల భారం పడుతుందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ ఆపరేటర్ గోపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరేష్, తాయన్న, హనుమంతు, బొజ్జప్ప, నాగేంద్ర, గోపాల్, బాషా, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి


నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్

ఎమ్మిగనూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలే మన భవిష్యత్తు అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ వారి బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలని రిటైర్డ్ ఐజీ, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మాచాని సోమప్ప జడ్పీ బాలికోన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక హెచ్ఎం కృష్ణమూర్తి, పీడీ మారుతాత్మజ సూచనమేరకు పాఠశాల మైదానం చదును చేసేందుకు అవసరమైన 40 ట్రిప్పుల గురుసుకు అవసరమైన రూ. 48వేలను విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చదువుకున్నవాడిగా, ఈ ప్రాంతవాసిగా తన వంతు పాఠశాలల అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సాయపడాలన్నారు. స్థానిక పాఠశాలలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రైతు బాంధవుడు చంద్రబాబు'


క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

గోనెగండ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడులకు ఆర్థిక సాయం అందజేసిన సీఎం చంద్రబాబు రైతు బాంధవుడని టీడీపీ నాయకులు రంగన్న, గోవిందు, బూత్ కన్వీనర్ వాల్మీకి రామనాయుడు, అన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబునాయుడి చిత్రపటానికి టీడీపీ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడు రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమలనాయుడు, కృష్ణయ్య, ఆంజనేయులు, రంగస్వామి, నగేష్‌నాయుడు, వండు, పెద్దదుగ్గెన్న, గుడిసె హనుమంతు, పింజరి రాజు, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


మాట్లాడుతున్న సీడీపీవో రాజేశ్వరి

మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాలింతలు బిడ్డకు పాలు ఇవ్వడమే శ్రేయస్కరమని మంత్రాలయం ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరిదేవి అన్నారు. మంగళవారం మంత్రాలయంలో గర్భిణులు, బాలింతలకు తల్లి పాల యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి ముర్రుపాలను పట్టించాలని తెలిపారు. తల్లి పాలు ఆరునెలలు వరకు అందించాలని సూచించారు. తల్లి పాలతో పౌష్టికాహారంతో పాటు వ్యాధి నిరోధక శక్తి, బిడ్డతో పాటు తల్లికి ఎంతో ఉపయోగకరమన్నారు. మూఢనమ్మకాలను వదిలేసి పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు అందించాలని, తల్లితో పాటు ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం ప్రోత్సాహం, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారనీ తెలిపారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుమిత్రమ్మ, టీచర్లు కళ్యాణి, భీమేశ్వరి, స్వప్న, శ్వేత, ప్రమీలమ్మ, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు


పెద్దకడబూరులో పవిత్ర జలంతో భక్తులు

పెద్దకడబూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులో వరుణ దేవుని కోసం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయ పూజారులు శివప్రసాద్ ఆచారి, వినోద్ కూమార్ ఆచారి మడి స్నానం ఆచరించి పవిత్ర గంగాజలంతో గ్రామంలోని దేవాతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి దూప దీవ నైవేద్యాలు సమర్పించి గంగా జలంతో అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే గ్రామంలోని కోంత మంది యువకులు పవిత్ర జలం కోసం తుంగభద్ర నదికి వెళ్లి అక్కడి నుంచి పవిత్ర తుంగ జలాన్ని తీసుకోచ్చి గ్రామంలోని దేవాతామూర్తులకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరవ రమాకాంత్ రెడ్డి, రామలింగ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, నరసింహులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో నిత్యపూజలకు విరామం


అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనం

మంత్రాలయం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూర్ణభోద పూజమందిరంలో సంస్థాన పూజచేశారు. కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం. నిర్వహించారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.పీఠాధిపతి, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసంను పాటించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు: రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో దర్శనార్థం దర్శనార్థం వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా సమిష్టిగా జాగ్రత్తలు తీసుకోవాలని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. మంగళవారం పూర్ణభోద పూజా మందిరంలో మఠంఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, శ్రీపతిఆచార్, సురేష్‌కోణాపూర్ ఆధ్వర్యంలో శ్రీమఠంలోని అన్ని శాఖల అధికారులతో ఉత్సవాలవిజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హరినాథ్, ఏఈ బద్రినాథ్, రవికులకర్ణి, విజయేంద్రాచార్, రాఘవేంద్రకులకర్ణి, స్టోర్‌ఇంచార్జి బద్రినాథ్, పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న డీఎస్ఎఫ్ నాయకులు

కోసిగి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ వినోద్ ఆధ్వర్యంలో మంగళవారం కోసిగి వాల్మీకి సర్కిల్‌లో విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. విద్యార్థుల హక్కులను హరించే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే బీవీ


దేశాయి చెరువులో జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే

నందవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం నందవరం మండలంలోని హలహర్వి దేశాయి చెరువులో సాగునీటి సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జలహారతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెరువులో ప్రత్యేక పూజలు చేసి జలహారతి చేపట్టారు. అనంతరం నాగలప్ప కట్టకు పూజలు చేశారు. చెరువు నుంచి కిందకు సాగునీటిని వదిలారు. రైతుల పంట పొలాలకు వెళ్లే సాగునీటి కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేశాయి మాధవరావు, ముగతి ఈరన్నగౌడు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి, ధర్మాపురం గోపాల్, భార్గవ్‌యాదవ్ పాల్గొన్నారు

ఉత్తమ సహకార సంఘంగా కడిమెట్ల సొసైటీ

ఎమ్మిగనూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలరిదిలోని కడిమెట్ల వ్యవసాయ పరపతి పరస్పర సహకార సంఘం జిల్లాలో ఉత్తమ సొసైటీగా(2023-24) ఎంపికైంది. సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు పంట రుణాల పంపిణీని సక్రమంగా వినియోగించుకోవటం పాటు రికవరీతీరు సక్రమంగా ఉండటం, ఎన్‌పీఏ తక్కువగా ఉండటం, ఇన్ బ్యాలెన్స్ లేకపోవటం, అధికంగా డిపాజిట్లు కలిగి ఉండటం వంటి కారణాలతో ఉత్తమ సొసైటీగా ఎంపికైయింది విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కడిమెట్ల సొసైటి చైర్మన్ విరుపాక్షిరెడ్డికి ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందజేశారు. అలాగే సొసైటీ సీఈఓ దత్తాత్రేయులుకు ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకు రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కడిమెట్ల సొసైటీ చైర్మన్ విరుపాక్షి రెడ్డి, సీఈవో దత్తాత్రేయులు

గ్రామాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

గోనెగండ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు గ్రామాల్లో రూ. 15లక్షలతో వేసిన సీసీ రోడ్లును ఆయన ప్రారంభించారు. జలజీవన్‌మిషన్ పథకం ద్వారా వేస్తున్న పైప్ లైన్ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి టీడీపీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎంవీఎస్ స్కీం కింద రూ. 19.5 కోట్లుతో 14గ్రామాలకు తాగునీటి పథకంను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలలో జలజీవన్ మిషన్ తో తాగునీటి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలోని అన్ని ప్రాజెక్టలను పూర్తి చేసేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మల్లయ్య, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మందకల్లు మృతి పార్టీకి తీరని లోటు: గోనెగండ్ల టీడీపీ సీనియర్ నాయకుడు మందకల్లు మృతి పార్టీకి తీరని లోటు ఆయన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, టౌన్ టీడీపీ ప్రెసిడెంట్ మహల్ రహంతుల్లా, సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు, బేతాలబడేసా, గ్రామ సర్పంచ్ హైమావతి, భారతం రహంతుల్లా మందకల్లు ఇంటికి చేరుకొని నివాళి అర్పించారు. కార్యక్రమంలో అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మాబు, కొత్తింటి ఫక్రుద్దీన్, నూర, మదీనా టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


పెద్దమరివీడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

రేపు వాహనాల వేలం

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం వాహనాలను వేలం వేస్తున్నట్లు పట్టణ ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ ఎక్సైజ్ నేరాలలో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను 7వ తేదీన గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక స్టేషన్‌లో బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సంప్రదించాలని ఆయన సూచించారు.

వసతులు కల్పించాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి కాశీం వలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

గోనెగండ్లలో ఘనంగా చిన్న దశమి వేడుకలు

గోనెగండ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో చింతలాముని, నల్లారెడ్డి స్వామి వారి చిన్న దశమి వేడుకలు మంగళవారం తెల్లవారుజామున దేవాలయ పీఠాధిపతులు, అర్చకులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోశాలకు ట్రాక్టర్ విరాళం


టీజీ భరత్ సమక్షంలో ట్రాక్టర్‌ను అందజేస్తున డీవీఆర్ గ్రూప్స్ అధినేత వెంకటేశ్వరరెడ్డి, మహేష్

కర్నూలు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీగాయత్రి గోసేవా సమితికి రూ.10 లక్షలు విలువ చేసే ట్రాక్టర్‌ను మంత్రి టీజీ భరత్, ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో డీవీఆర్ గ్రూప్స్ సంస్థల అధినేత డి.వెంకటేశ్వరరెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డీవీఆర్ డిజిటల్ జనరల్ మేనేజర్ ఎస్కే మహేష్, గాయత్రి గోసేవా సమితి ప్రతినిధులు డీవీ జగదీష్, ఇల్లూరు లక్ష్మయ్య, టీఎస్ విజయకుమార్, డీవీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మిగనూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



మంత్రాలయంలో..

మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లతో పాటు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షుడు వగరూరు జయరాజు, తాలుకా ప్రధాన కార్యదర్శి హాశేనీ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఉపాధ్యక్షులు చాంద్‌బాషా ఆధ్వర్యంలో మంత్రాలయం తాలుకా, మండల కమిటీ ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కార్యక్రమంలో తాలుకా ఉపాధ్యక్షులు గోవిందు, నాగరాజు, కోశాధికారి సాబువలి, పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షులు శ్రీనివాసులనాయుడు, పట్టణ అధ్యక్షులు జీబీ పరమేశ్వర అన్నారు. మంగళవారం జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పాత తహసీల్దార్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ మీదుగా కొత్త తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు చిన్నాకుల నాగరాజు, జాలవాడి బాషా, నూర్ అహ్మద్, భీమన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గోనెగండ్ల మండల ఏపీయూడబ్ల్యూజే నాయకులు అక్బర్‌బాషా, కిరణ్, ఖలీల్‌బాషా, దండు ఖాజ, కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్లను మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు పుల్లయ్య, సోమన్న, ఈరన్న డిమాండ్ చేశారు. మంగళవారం జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ, రామన్న, మల్లికార్జునగౌడ్, రాజు, లింగమూర్తి, ఏలియాస్ పాల్గొన్నారు.

కోసిగి: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమిస్తామని ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి బి.హనుమేష్ అన్నారు. రాష్ట్ర జిల్లా కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కోసిగిలోని యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు జిల్లా సహాయ కార్యదర్శి బి.హనుమేష్, తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, సీనియర్ జర్నలిస్టు గడ్డం వీరన్న, రాజేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



కోసిగిలో..